
సాక్షి సంగారెడ్డి

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024

సంగారెడ్డి పట్టణంలోని రామ మందిరంలో లడ్డూలను ఎగురవేస్తున్న జగ్గారెడ్డి(ఇన్‌సెట్‌లో), పట్టుకోవడానికి పోటీ పడుతున్న జనం





ఉత్సాహంగా ఉగాది వేడుకలు

సంగారెడ్డి పట్టణంలోని రామ మందిరంలో ఉగాది ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు. పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని పేలాలు, లడ్డూలు ఎగురవేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఆయన భార్య నిర్మలారెడ్డి, కూతురు జయారెడ్డి, కొడుకు భరత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్త బృందం ఆధ్వర్యంలో రామ కీర్తనలు పాడుతూ భజన చేశారు. కొద్దిసేపు జగ్గారెడ్డి డోలక్ వాయించారు. అలాగే ఉట్టి కొట్టుడు కార్యక్రమం చేపట్టారు. అనంతరం మందిరం పైనుంచి జగ్గారెడ్డి, ఆయన కూతురు లడ్డూలను విసిరేశారు. వాటిని పట్టుకోవడానికి జనం పోటీ పడ్డారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి/ సంగారెడ్డి టౌన్



మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

చౌటకూర్ మండలం శివంపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఆయన ప్రార్థనలు చేశారు. అక్కడ పిల్లలకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. - సంగారెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి దామోదర

న్యూస్‌రీల్

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకొని పట్టణంలోని కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వేద పండితుల సమక్షంలో లగ్న పత్రికను రూపొందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, విజయ్ కుమార్, సపాన దేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సంగారెడ్డి అర్బన్: రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా పోరాటం చేద్దామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ పిలుపునిచ్చారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్, పూలే ఆశయ సాధనకు యువత కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ఇంటివద్దకే తలంబ్రాలు

నారాయణఖేడ్: భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు ఇంటివద్దకు చేర్చే కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టిందని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, పీఆర్‌ఓ పాండు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.151 చెల్లించి బుక్ చేసుకుంటే తలంబ్రాలు ఇంటి వద్దకు తీసుకొచ్చి అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఖేడ్ ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు 9441071134, 9959223170, 9989032336 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మల్లన్న ఆదాయం 2, ఖర్చు14 శాతం

కొమురవెల్లి(సిద్దిపేట): తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారికి నిత్యకల్యాణం, ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన, ప్రసాద వితరణ అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో స్వామి వారి ఆదాయం 02, ఖర్చులు 14 శాతం ఉంటాయని పంచాంగ శ్రవణంలో వీరశైవ ఆగమ పండితులు ఆనందయ్యస్వామి, సిద్దేశ్వర్, వీరేశలింగం చదివి వినిపించారు.

జోరుగా జీరో దందా!

- బిల్లులు, వే స్లిప్పులు లేకుండా వస్తువుల కొనుగోలు
- డైలీ పార్శిల్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా దుకాణం ముందుకి దిగుమతి
- ట్యాక్స్ కట్టకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు



జిల్లాలో అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొన్ని వస్తువులకు వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. రూ.కోట్లలో లావాదేవీలు జరుపుతూ పైసా పన్ను చెల్లించడం లేదని తెలుస్తోంది. జీరో వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేరని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు జోగుతూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

- సదాశివపేట(సంగారెడ్డి)

జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, జోగిపేట తదితర పట్టణాలకు నిత్యం ట్రాన్స్‌పోర్టుల ద్వారా హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి వివిధ రకాల సరుకుల రవాణా జరుగుతుంది. ఈ ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా వస్తువులను కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. అయితే చాలా వస్తువులు, సరుకులకు నామమాత్రంగా బిల్లులు, వే బిల్లులు తీసుకుంటూ అధిక శాతం జీరో మార్గాన కొనుగోలు చేస్తున్నారు. జీఎస్టీ కట్టాల్సి వస్తుందని ఎలాంటి రసీదులు లేకుండా వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో జీరో వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతున్నా అధికారులు ఈ దందాపై దృష్టి పెట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి.

లారీల్లో పార్శిళ్లు

హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి జిల్లాలోని పట్టణాలకు నిత్యం ట్రాన్స్‌పోర్టుల ద్వారా సరుకులు, ఇతర వస్తువులు అక్రమంగా సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. హోల్‌సేల్ దుకాణాలకు ఫోన్ చేసి ఆర్డర్ చెప్పి.. ఫోన్‌పే. గోగూల్‌పే ద్వారా డబ్బు వేస్తున్నారు. మరుసటి రోజు ఉదయం వరకు సరుకులు దుకాణం వద్ద సురక్షితంగా దిగుమతి అవుతుంటాయి. కానీ చాలా వస్తువులకు బిల్లులు, వే బిల్లులు ఉండవు. వస్తువుల వివరాలు కిరాణా పట్టీలా ఓ కాగితంపై రాసి ఉంటుంది. మార్గమధ్యలో అధికారులు డైలీ పార్శిల్ ట్రాన్స్‌పోర్టు లారీలను చెక్ చేస్తే మామూళ్లు ఇచ్చి బయటపడతారు.

పట్టించుకోని అధికారులు

సాధారణంగా వాణిజ్య సరుకులను ఆర్టీసీ కార్గో, అనుమతి ఉన్న ఇతర ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కంపెనీల ద్వారా రవాణా చేయాలి. అలా చేయాలంటే వస్తువులకు సంబంధించి బిల్లులు, వే బిల్లు జతచేయాల్సి ఉంటుంది. రవాణాలో సరుకులు ధ్వంసం అయితే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలే బాధ్యత వహిస్తాయి. కంపెనీలు నిబంధనల మేరకు చార్జీలు వసూలు చేస్తాయి. కానీ జీరో మార్గాన చేరవేసే డైలీ పార్శిళ్లకు ఏ బిల్లులు అవసరం లేదు. ఒక పార్శిల్‌కు రూ.60 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. రిజిష్టరు కంపెనీల కంటే తక్కువ ధరకే రవాణా చేస్తారు. ఇలా కోట్లాది రూపాయల వస్తువులను కొనుగోలు చేస్తూ ప్రభుత్వానికి పైసా పన్ను కట్టడం లేదు. కళ్ల ముందు ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదు. జీరో వ్యాపారాన్ని అడ్డుకట్ట వేసి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మొద్దు నిద్రపోతున్నారు.

నేత్రపర్వంగా శతఘటాభిషేకం



కలశ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): ఉగాది పర్వదినవేళ అష్టోత్తర శతకలశాభిషేకం నేత్రపర్వంగా సాగింది. లక్ష్మీనృసింహుల దివ్యదర్శనంతో భక్తజనావళి తరించింది. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిలో ఆధ్యాత్మిక అనుభూతులు పంచిన బ్రహ్మోత్సవాలు మంగళవారం అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగిశాయి. ఉదయం అర్చక స్వాములు ఆలయ ముఖమండపంలో 108 కలశాలు స్థాపన చేశారు. ఆలయ ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణ, తీర్థజనుల సమక్షంలో అర్చకులు శాస్త్రోక్తంగా కలశ పూజ నిర్వహించారు. హోమం జరిపారు. మహాపూర్ణ కలశంతో ఆలయ ప్రదక్షిణ చేసి నృసింహ నామార్చనలు, మంత్రోచ్ఛారణల మధ్య గర్భగుడిలో మూలవరులకు మహాభిషేకం జరిపారు. పట్టువస్త్రాలు, సర్వాభరణాలు, మల్లె, జాజి తదితర పూలమాలికలతో స్వామివారిని విశేషాలంకృతులను చేశారు. ఉగాది పర్వదిన వేళ విశేష సంఖ్యలో భక్తులు నాచగిరీశుని దివ్యమంగళరూపం దర్శించుకుని తరించారు.

వంతెన ఎప్పుడు పూర్తయ్యేనో?

- జహీరాబాద్, అల్గోల్ మధ్య కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణం
- నత్తనడకన పనులు
- త్వరగా పూర్తిచేయాలంటున్న స్థానికులు



జహీరాబాద్-అల్గోల్ రహదారిలో నిర్మిస్తున్న బ్రిడ్జి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నుంచి అల్గోల్ వెళ్లే దారిలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. వానాకాలంలో ఇక్కడి వాగు ఉప్పొంగుతుంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. భారీ వానలు పడితే వరద నీరు రోడ్డుపై నుంచి ప్రవహించడం వల్ల రహదారి కూడా కనిపించని పరిస్థితి ఉంటుంది. జహీరాబాద్-అల్గోల్ రోడ్డు గుండా అల్లానా పరిశ్రమతో పాటు భరత్ నగర్ కాలనీ, అల్గోల్, పోట్‌పల్లి, ఎల్గోయి గ్రామాల ప్రజలు వస్తూ పోతుంటారు. గతేడాది వర్షాకాలంలో ఈ రోడ్డుపై నుంచి ప్రయాణం చేయడానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. సమస్యను గుర్తించిన ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 33 లక్షలు మంజూరు చేయించారు. కానీ పనులు వేగవంతంగా పనులు చేయించడంలో కాంట్రాక్టర్ అలసత్వం చూపుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. వచ్చే వానాకాలం వరకు వంతెన పూర్తిచేయకపోతే మళ్లీ ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి శరవేగంతో బ్రిడ్జి పనులు పూర్తి చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జహీరాబాద్-అల్గోల్ దారిలో గతంలో నిర్మించిన కల్వర్టుకు ఇరుపక్కల పిట్టగోడలేక ప్రమాదం పొంచి ఉంది. నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉండడం వల్ల వెహికిల్స్ అదుపుతప్పి వాగులో పడిపోయే అవకాశం ఉంది. ప్రమాదాల నివారణకుగాను కల్వర్టుకు ఇరుపక్కల పిట్టగోడ కట్టాలని కూడా ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా బ్రిడ్జి పనులు వర్షకాలానికి పూర్తి చేయిస్తామని చెప్పారు.

తెలంగాణ పురం హామీ ఏమైంది?

తెల్లాపూర్‌లో రఘునందన్ ప్రచారం



తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌లో మాట్లాడుతున్న రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ ఉద్యమం సమయంలో బీఆర్‌ఎస్ నేతలు తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మారుస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. మంగళవారం బీహెచ్‌ఈఎల్ జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో వాకర్స్‌తో ఆయన మాట్లాడారు. అక్కడ యువకులతో కాసేపు క్రికెట్ ఆడారు. కీర్తిమహాల్ బస్‌స్టాండ్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో ప్రజలతో మాట్లాడారు. అక్కడ స్థానిక యువకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాలనీ యువకులతో కలసి తెల్లాపూర్ రైల్వే స్టేషన్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా మార్చాలని తీను అసెంబ్లీలో పోరాటం చేసినట్లు గుర్తుచేశారు. తెల్లాపూర్‌లో ఓటు హక్కు ఉందని చెప్పే నేతలకు ఇక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తెలియదా అని ప్రశ్నించారు. అది నిర్మిస్తే వేలాదిమంది ప్రజలకు రైల్వేస్టేషన్, ఎంఎంటీఎస్ రైలు ఉపయోగపడుతుందన్నారు. తాను గెలిచిన వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించి రేడియల్ రోడ్డు నంబర్ 7, రింగ్‌రోడ్డుకు అనుసంధానం చేసే విధంగా కృషి చేస్తానన్నారు.

తాగునీటికి తండ్లాట

మండలంలోని పలు తండాల్లో తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. బిందెడు నీటి కోసం గంటల తరబడి ఎండలో వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని జీర్గి గ్రామపంచాయతీలో నాలుగు రోజులుగా నీటి సరఫరా కావడం లేదు. దీంతో తండాలోని మహిళలు, పిల్లలు ఇటీవల వేసిన బోరు వద్దకు పరుగులు తీశారు. అక్కడ నీటి కోసం గంటల తరబడి నిలబడి వేచిటుండాల్సి వచ్చింది. అలాగే మండలంలోని చాప్టా(బీ), ఎర్లరేగడి తండాలో నీటి ఎద్దడి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

- కంగ్టి(నారాయణఖేడ్)



జీర్గి తండాలో నీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు, పిల్లలు

మంజీరా.. వెలవెల

మంజీరా డ్యామ్‌లో తగ్గిన నీటి మట్టం





మనూరు మండలం పుల్‌కుర్తి వంతెన వద్ద..

జిల్లాలోని మంజీరా జలాశయం అడుగంటుతోంది. నీటి మట్టం తగ్గి వెలవెలబోతోంది. ఈ నది ద్వారా హైదరాబాద్‌కు తాగునీటి తోపాటు పరివాహక ప్రాంత పంటలకు సాగునీరు అందుతుంది. నదిలో నీరు ఖాళీ అవుతుండటంతో భూమిపైకి కనిపిస్తుంది. అలాగే మంజీరా నది ఎగువ ప్రాంతమైన నాగల్‌గిద్ద, మనూరు మండలాల్లోని నదిలో నీటి మట్టం రోజురోజుకు తగ్గుతుంది. సింగూరు ప్రాజెక్టు నుండి నీటిని దిగువకు వదులుతుండటంతో నీరు తగ్గు ముఖం పట్టిందని రైతులు అంటున్నారు. ఏప్రిల్ మొదట్లోనే ఇలా ఉంటే మే నెల చివరిలో ఎలా ఉంటుందో జిల్లా వాసులు భయపడుతున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

అలరించిన కుస్తీ పోటీలు

నారాయణఖేడ్ : ఉగాది ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని మార్డిలో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ గుర్రపు మశ్చేందర్, ప్రముఖులు రవీందర్‌రెడ్డి, గుర్రపు జలంధర్, జితేందర్‌రెడ్డి, బస్వరాజ్ పాటిల్, చెన్నారెడ్డి, సంగారెడ్డి, గుర్రపు జ్ఞానేశ్వర్, కుమ్మరి శ్రీనివాస్, కుమ్మరి సంజీవులు తదితరులు పాల్గొన్నారు.



కుస్తీ పడుతున్న మల్లయోధులు

సొంత భవనాలు కరువు

- ఇరుకు గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- ఎనిమిదేళ్లుగా ఇదే దుస్థితి
- అరకొర వసతుల నడుమ విధులు
- స్థలం కేటాయించరు, నిధులు మంజూరు కావు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



ఐకేపీ కార్యాలయంలో అల్లాదుర్గం పీఆర్ సబ్ డివిజన్

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. గత ప్రభుత్వం పునర్విభజనలో భాగంగా సబ్ డివిజన్ ఏర్పాటు చేస్తూ పలు కార్యాలయాలు మంజూరు చేసింది. కార్యాలయాలు ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు కావస్తున్నా సొంత భవనాలు మాత్రం లేవు. ఒకే భవనంలో రెండు, మూడు కార్యాలయాలు కలిపి ఏర్పాటు చేశారు. దీంతో చాలీచాలని గదులతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సరైన వసతులు కరువయ్యాయి. సొంత భవనాలు ఏమోగాని అద్దె భవనాలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది.

- అల్లాదుర్గం పట్టణంలో ఎనిమిదేళ్ల కిందట ప్రభుత్వం పునర్విభజనలో భాగంగా పంచాయతీరాజ్ సబ్ డివిజన్, పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఇరిగేషన్ సబ్ డివిజన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలను ఏర్పాటు చేసింది.
- ఇందులో ఐసీడీఎస్ కార్యాలయం కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగింది. ప్రాజెక్టు పరిధిలో రేగోడ్, టేక్మాల్, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 9 సెక్టార్లు ఉండగా, ముగ్గురు సూపర్ వైజర్లు మాత్రమే ఉన్నారు. అద్దె భవనం రోడ్డు విస్తరణలో పోవడంతో కూల్చి వేశారు. దీంతో కార్యాలయం రోడ్డున పడింది. అధికారులు , ప్రజాప్రతినిధులు కలిసి కార్యాలయాన్ని పీఆర్ కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. మూడేళ్లుగా ఒకే భవనంలో రెండు కార్యాలయాలను నిర్వహిస్తున్నారు.
- అల్లాదుర్గం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ, ఇద్దరు సూపర్‌వైజర్‌లు హైదరాబాద్ స్త్రీ, శిశుసంక్షేమ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. ఐదేళ్లుగా ఏసీడీపీఓ డిప్యుటేషన్‌పై మరో జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో ఇన్‌చార్జి జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహించడం గమనార్హం.
- పంచాయతీ రాజ్ సబ్‌డిజన్ కార్యాలయం పాత ఐకేపీ కార్యాలయంలో కొనసాగుతుంది. ఈ కార్యాలయానికి సొంత భవనం కోసం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ ముగ్గురు అటెండర్లు, డీఈఈ మాత్రమే ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ లేరు
- ఇరిగేషన్ కార్యాలయం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో చిన్న గదిలో కొనసాగుతుంది. ఈ కార్యాలయంలో డీఈఈ, ఏఈ, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. అటెండర్, రికార్డు అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు లేరు.



ఇరుకు గదిలో కొనసాగుతున్న అల్లాదుర్గం సీఐ కార్యాలయం

- అల్లాదుర్గం సీఐ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయంలో కొనసాగుతుంది. ఇరుకైన రెండు గదుల్లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలతో కార్యాలయంలో సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయాలు ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు కావస్తున్నా నిధులు మంజూరు చేయకపోవడంతో సొంత భవనాల నిర్మాణం జరగడం లేదు.

స్థలం కేటాయించలేదు



గత ప్రభుత్వం సబ్ డివిజన్ కార్యాలయాలు మంజూరు చేసింది. ఏళ్లు గడిచినా కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. కనీసం భవన నిర్మాణాల కోసం స్థలాలు సహితం కేటాయించలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు సహితం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

– బలరాం, అల్లాదుర్గం

మంత్రి దృష్టికి తీసుకెళ్తాం



అల్లాదుర్గంలో ప్రభుత్వ కార్యాలయాల దుస్థితిపై మంత్రి దామోదర నర్సింహ దృష్టికి తీసుకెళ్తాం. కార్యాలయాలకు స్థలాలు కేటాయించి, భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తా. గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు.

– మహేశ్, కాంగ్రెస్ యూత్ నాయకుడు, అల్లాదుర్గం

క్లుప్తంగా

కార్యకర్త ఇంటికి మంత్రి పొన్నం ప్రభాకర్



జాగిరి రాజయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో 2023 నవంబర్ 24న కాంగ్రెస్ బహిరంగ సభకు ప్రియాంక గాంధీ హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో కిషన్‌నగర్ వద్ద రోడ్డు పక్కన ఉన్న జాగిరి రమ ఇంటికి వెళ్లారు. సాధారణ కుటుంబ సభ్యులతో మాట్లాడి మీకు ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని హామీ ఇచ్చి కాసేపు మాట్లాడారు. మళ్లీ మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ కిషన్‌నగర్‌కు వెళ్లి జాగిరి రాజయ్య, రమ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాకు ఉన్న వ్యవసాయ భూమి సమస్యల్లో ఉందని, దానిని పరిష్కరించాలని మంత్రి ప్రభాకర్‌కు విన్నవించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. వీరి వెంట పార్టీ మండల అధ్యక్షుడు చందు, మాజీ సర్పంచ్ బొంగొని శ్రీనివాస్, పోశవేని శ్రీశైలం ఉన్నారు.

అగ్గిపెట్టెలో పట్టె పట్టువస్త్రం

- మంత్రి పొన్నంకి అందజేసిన కార్యకర్త

హుస్నాబాద్: ఉగాది పండుగ సందర్భంగా హుస్నాబాద్‌లో మంగళవారం జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పార్టీ కార్యకర్త తన అభిమానాన్ని చాటుకున్నాడు. హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్ బంగారు పూతతో అగ్గిపెట్టెలో పట్టె పట్టువస్త్రాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి మంత్రి పొన్నంకు అందజేశారు. పార్టీ కార్యకర్త చూపిన అభిమానానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆనందం వ్యక్తం చేశారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మధు(ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం పట్టణ పరిధిలోని ఎంబీజీ కాలనీలో చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన ప్యాట మధు(28) ఎయిర్ టెల్ డిష్ టీవీకి సంబంధించిన జాబ్ చేస్తూ పట్టణ పరిధిలోని ఎంబీజీ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఏడాది కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమారుడి వైద్య చికిత్స రూ.5 లక్షల అప్పు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ప్యాటా జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నర్సింలు (ఫైల్)

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఓ వీధిలో మహిళలు కులాయి వద్ద నీళ్లు పట్టుకుంటుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కొందరు యువకులు అక్కడి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి జంపర్ పోయినట్టు గుర్తించారు. ఈ క్రమంలో చింత నర్సింలు (45) అనే వ్యక్తి ట్రాన్స్‌ఫారమ్ జంపర్ సరిచేసేందుకు వెళ్లి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారులు మనోహర్, చందు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ లింగం వివరించారు.



మండే ఎండ.. చల్లని అండ

- పుచ్చకాయలు, కొబ్బరిబోండాలకు భలే డిమాండ్
- పెరిగిన ఎండ తీవ్రత



మునిపల్లి(అందోల్): మండే ఎండలకు చల్లదనం కోసం ప్రజలు వెంపర్లాడుతున్నారు. వేసవి కాలంలో ఎండలు భగ్గుమంటున్నాయి. బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. భానుడి ప్రతాపం నుంచి తట్టుకుకోవడానికి ప్రజలు మార్కెట్‌లో పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు తీసుకుంటున్నారు.

పుచ్చకాయ..

పుచ్చకాయలో అధిక నీటి శాతం కలిగి ఉంది. వేసవిలో శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఎండ తీవ్రత పెరగడంతో పుచ్చకాయలు తింటే శరీరానికి చల్లధనంతో పాటు, వివిధ రకాల పోషకాలు నీరు అందే అవకాశం ఉండడంతో జనం ఎక్కువగా పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్నారు. అలాగే కొబ్బరి నీళ్లలో అమూల్యమైన పోషకాలు ఉంటాయి. దప్పిక తీర్చడంలో కొబ్బరి నీళ్లకు మించిన పానీయం లేదంటే అతిశయోక్తి కాదు. డీ హైడ్రేషన్ వల్ల కలిగే నష్టాన్ని నివారిస్తుంది. కొబ్బరి నీటిని లీటర్ లెక్కన వ్యాపారస్తులు అమ్ముతున్నారు. ఎండలు ఎక్కువ కావడంతో మార్కెట్‌లో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది.

అవసరమైతేనే బయటికి వెళ్లాలి



అత్యవసర మనుకుంటే ప్రజలు బయటకు వెళ్లాలి. మధ్యాహ్నం 3 గంటల తర్వాతే బయటకు వెళ్లాలి, కాటన్ దుస్తులు ధరించాలి. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లని పదార్థాలు, నీళ్లు, కొబ్బరి బోండాల వంటివి ఎక్కువ తీసుకోవాలి. మసాలలతో కూడిన భోజనం వంటివి తినకూడదు.

గాయత్రీ దేవి, వైద్యురాలు

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళలు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరులో పెళ్లి బట్టలకొనేందుకు వచ్చి యువతి, కొండపాకలో వివాహిత, కుమారుడితో సహా తల్లి కనిపించకుండా పోయారు.

పెళ్లి బట్టలకొచ్చి యువతి

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం.. నారాయణఖేడ్‌కు చెందిన మౌనిక(20)కు ఈ నెల 15వ తేదీన వివాహం కుదరడంతో బట్టలు కొనేందుకు పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎం కాలనీలో ఉండే బాబాయ్ సాయిలు వద్దకు సోమవారం వచ్చింది. షాపింగ్ అనంతరం అదే రోజు యువతిని నారాయణఖేడ్ బస్సు ఎక్కించగా ఇంటికి వెళ్లలేదు. యువతి కోసం స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మౌనిక అదృశ్యంపై ఆమె బాబాయ్ సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడితో సహా తల్లి..

కొండపాక(గజ్వేల్): కుమారుడితో సహా తల్లి అదృశ్యమైన ఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన కనకరాజును ఇల్లరికం తెచ్చుకొని కొండపాకకు చెందిన లావణ్యతో వివాహం చేశారు. ఇద్దరూ కొండపాకలో ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కనకరాజు మద్యానికి బానిసై లావణ్య ఇతరులతో మాట్లాడితే అనుమానపడటంతో పెద్దమనుషులు పలుమార్లు పంచాయతీ పెట్టి నచ్చచెప్పారు. ఈ నెల 8వ తేదీన లావణ్య, తొమ్మిదేళ్ల కుమారుడు ఋషి వర్ధన్ కనిపించడం లేదని ఖమ్మంపల్లిలో ఉంటున్న లావణ్య అక్క కనకలక్ష్మికి కనకరాజు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కనకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



కుమారుడితో లావణ్య

ఇంటి నుంచి వెళ్లిన వివాహిత..

వివాహిత అదృశ్యమైన ఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన బక్కని స్వామి పెద్ద కూతురు భవానీ(28) అదే మండలంలోని మాత్‌పల్లి గ్రామానికి చెందిన నాయిని రాజుతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. భవానీ తరుచూ అనారోగ్యానికి గురవుతుండటంతో మార్చి 30వ తేదీన ఇద్దరు పిల్లలను తీసుకొని కుకునూరుపల్లిలోని తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 6వ తేదీన ఇంట్లోంచి చెప్పకుండా బయటకు వెళ్లిన భవానీ తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికుతున్నపటికీ ఆచూకీ లభించడం లేదు. తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. ఎవరైనా గుర్తుపడితే 87126 67345 సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్ : పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని పార్థ లేఅవుట్‌లో బ్యాంకు ఉద్యోగి గౌతమ్ నివాసం ఉంటున్నాడు. అతడు పని నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం పటాన్‌చెరుకు వచ్చాడు. సాయంత్రం ఇంటికి వెళ్లి చూసేసరికి తాళం పగులగొట్టి తలుపు తెరిచి ఉంది. లోనికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వాటిలోని దాదాపు రూ.4 లక్షలు విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించాడు. వెంటనే 100 నంబర్ కు కాల్ చేయడంతో పటాన్‌చెరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

నగదు పట్టివేత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుసెల్లి చెక్‌పోస్టు వద్ద మంగళవారం హద్నూర్ పోలీసులు నగదు డబ్బును పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా హుసెల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రోజువారి తనిఖీ నిర్వహిస్తున్నారు. కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనంలో రూ.75 వేలు నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామానాయుడు తెలిపారు.

పోలీసులపై దాడి

- ఇద్దరు నిందితులు అరెస్ట్



నిందితులతో పోలీసులు

సిద్దిపేటరూరల్: బ్లూకోర్టు సిబ్బందిపై దాడి చేసిన ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం అర్ధరాత్రి 11 గంటలకు రూరల్ పోలీస్ స్టేషన్ బ్లూ కోర్టు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చిన్న గుండెవెల్లి గ్రామంలో గస్తీ నిర్వహిస్తుండగా గ్రామ శివారులో కొంతమంది యువకులు మద్యం తాగుతూ గొడవ పడుతుండడాన్ని గమనించారు. అక్కడికి వెళ్లిన బ్లూకోర్టు కానిస్టేబుళ్లు వారిని నిలువరించే ప్రయత్నం చేయగా చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన మద్దెల కరుణాకర్, ఉట్ల మధు ఇద్దరూ మద్యం మత్తులో పోలీసులతో గొడవకు దిగారు. పోలీసులను గాయపరిచి విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటనపై సదరు కానిస్టేబుళ్ల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మామిడి కొమ్మలు తెచ్చేందుకు వెళ్తుండగా..

- ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ
- యువకుడు మృతి, మరో యువకుడికి గాయాలు
- పండుగ పూట విషాదం

పాపన్నపేట(మెదక్): పండుగ పూట విషాదం నెలకొంది. ఇంట్లోకి మామిడి కొమ్మలు తెచ్చేందుకు ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తున్నారు. రెండు బైక్ ఎదురెదుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నార్సింగి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. నార్సింగి గ్రామానికి చెందిన ఎరుకల మహేశ్(27) మామిడి కొమ్మలు తెచ్చేందుకు ఉదయం బైక్‌పై గ్రామ శివారుకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో మల్లంపేటకు చెందిన నీరుడి రాము మరో బైక్‌పై మామిడి కొమ్మల కోసం అదే ప్రాంతానికి బైక్‌పై వస్తున్నాడు. మార్గ మధ్యలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాముకు సైతం గాయాలు కావడంతో పాపన్నపేటలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడు మహేశ్ వారి తల్లిదండ్రులు ఒక్కడే కుమారుడు. పండుగల ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా..

వ్యాను ఢీకొని వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): వ్యాను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చేగుంట శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతసాగర్ గ్రామానికి చెందిన చిక్కుడు నాగభూషణం(40) చేగుంట శివారులోని జాతీయ రహదారిపై పబ్లిక్ టాయిలెట్స్ వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అనంతసాగర్ నుంచి పనికి నడుచుకుంటూ వెళ్తుండగా నాగభూషణంను రామాయంపేట వైపు నుంచి వస్తున్న వ్యాగనార్ వ్యాను ఢీకొట్టింది. అనంతరం వ్యాను డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగభూషణం అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ బాలరాజు పంచనామా నిర్వహించారు. మృతుడి సోదరుడు బూదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



నాగభూషణం మృతదేహం

పేకాటరాయుళ్ల అరెస్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : పేకాట శిబిరంపై ఎస్‌ఓటీ, రామచంద్రాపురం పోలీసులు దాడి చేసిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు ఖచ్చితమైన సమాచారం అందింది . దీంతో ఎస్‌ఓటీ పోలీసులు, రామచంద్రాపురం పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.64,690 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం

హత్నూర(సంగారెడ్డి): పలు ఇళ్లపై ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం రాత్రి హత్నూర మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈఎస్ నవీన్ చంద్ర, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాణెమ్మ ఆధ్వర్యంలో సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట, హత్నూర మండలం చింతల్ చెరువు, కొత్తగూడెం గ్రామాలలో పలు ఇళ్లపై దాడులు చేశారు. ఈ దాడుల్లో మూడు కేజీల ఎండు గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రతిమ జానీ, చింతల చెరువు, కొత్తగూడెం గ్రామాలకు చెందిన భాను, సాగర్, చందు, సాయి, శివ, ఉదయ్, క్లెం శ్రీకాంత్ లను అదుపులోకి తీసుకున్నారు. చాపల శ్రీకాంత్, వివేక్ గౌడ్ పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు హనుమంతు, అనుదీప్, దిలీప్ కుమార్ రెడ్డి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పదులు వందలై.. ఉపాధి మెండుగై

గొర్రెల పెంపకంతో జీవనోపాధి

- జిల్లాలు సైతం దాటి పెంపకం
- పంట పొలాల్లో జీవ ఎరువుగా వినియోగం
- రోజుకి రూ.600, బియ్యం

ఝరాసంగం(జహీరాబాద్): గొర్రెల పెంపకాన్ని ఉపాధిగా మలుచుకొని గ్రామాలను సంచరిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కొన్నేళ్లుగా స్థానికంగా సరైన ఉపాధి లేక గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. సొంత గ్రామాలను వదిలి గ్రామాల్లో సంచరిస్తూ జీవాలను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు. సుమారు 2,000 గొర్రెలతో వచ్చి గ్రూపులుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నారు. రాష్ట్రంలోని నారాయణపేట జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చి సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ గొర్రెలను పెంచుకుంటున్నారు.



ఝరాసంగం మండలం సర్పాపూర్ గ్రామ శివారులో రైతు పంట పొలంలో గొర్రెల మంద

గొర్రెల పెంపకంతో ఉపాధి

గొర్రెలను కాపాడుకుంటూ వాటితో ఉపాధి పొందుతున్నామని పశువుల కాపర్లు పేర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామ శివారులోని వివిధ పంట పొలాల్లో తిరుగుతూ మేత మేయిస్తుంటారు. రాత్రి వేళల్లో రైతుల పొలాల్లో చుట్టూ వలవేసి, అందులో గొర్రెలను వదులుతారు. ఈ విధంగా చేయడంతో పొలం రైతులు రోజుకి రూ.600తోపాటు బియ్యం ఇస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఝరాసంగం, రాయికోడ్, వట్‌పల్లి, అల్లాదుర్గంతో పాటు తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా వికారాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో సైతం తమ వారు ఉన్నట్లు పేర్కొన్నారు.


ఉపాధి పొందుతున్నాం



గత కొన్ని సంవత్సరాలుగా గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతున్నాం. వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ గ్రామాలలో ఉన్న రైతుల పంట పొలాల్లో మందలు వేస్తూ వాటి ఎరువు ద్వారా ఉపాధి పొందుతున్నాం.

హుస్సేన్, జాజాపురం, నారాయణపేట జిల్లా

జీవాల ఎరువుతో ప్రయోజనం



పంట పొలాలకు జీవాల ఎరువులతో ప్రయోజనం చేకూరుతుంది. వాటి ఎరువు ద్వారానే జీవన ఉపాధి సాగిస్తున్నాం. మేత కొరకు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ జీవాలను కాపాడుకుంటూ పెంచుతున్నాం.

– మహేశ్, జాజాపురం, నారాయణపేట జిల్లా